**కథ**

# కష్టార్జితం

**"అమ్మా! నా బట్టలు ఒక్కటీ కనిపించడం లేదు, ఎక్కడ పెట్టావు?" వినయ్ తల్లిని కేకేశాడు.**

**"అన్నీ గదిలోనే ఉన్నాయి కదరా" అంటూ పిల్లల గదిలోకి వచ్చిన లలిత బట్టల స్టాండు ఖాళీగా ఉండడం చూసి ఆశ్చర్యపోయింది.**

''కొంపదీసి దొంగ ఎవడూ రాలేదుకదా'' అంటూ కిటికీకి అడ్డంగా ఉన్న కర్టెను లాగి చూసింది. దోమలు రాకుండా కిటికీకి వేసిన మెష్ చతురస్రాకారంలో కోయబడి ఉంది. తన అనుమానం నిజమైనందుకు ఎంతో బాధపడింది.

''ఎన్ని బట్టలు పోయాయి? అన్నీ కొత్తగా కొన్నవే'' అంది కొడుకుతో.

''నాన్నా, నిన్న రాత్రి మనింటికి దొంగ వచ్చి అన్నయ్య బట్టలన్నీ తీసుకెళ్లిపోయాడు'' వినయ్ చెల్లెలు పద్మ హాల్లో కూర్చుని ఉన్న తండ్రి గోవర్ధన్‌తో చెప్పింది. గోవర్ధన్ గదిలోకి వచ్చి చూశాడు.

''నువ్వు బయటికెళ్లి బట్టలు కిటికీ దగ్గర పడేసి పోయారేమో చూడు'' అన్నాడు కొడుకుతో.

''అక్కడెలా ఉంటుంది?''

''వాళ్లు డబ్బుల కోసం వచ్చి ఉంటారు. నీ పర్సు అల్మైరాలో ఉంచుతావు కదా. నీ జేబుల్లో పర్సు గానీ డబ్బులు గానీ దొరక్కపోయేసరికి అక్కడే పడేసి వెళ్లుంటారు''

వినయ్ వెళ్లి వెంటనే వచ్చాడు. అతని చేతుల్లో బట్టలున్నాయి. అన్నీ చూసి ఏదీ పోలేదని నిర్ధారించాడు.

''అంత కచ్చితంగా ఏదీ పోయి ఉండదని ఎలా చెప్పగలిగారు నాన్నా?'' ఆశ్చర్యంగా తండ్రిని అడిగాడు వినయ్.

''ఆ.. బట్టలు నా కష్టార్జితంతో కొన్నవి కాబట్టి. మనం కష్టపడి సంపాదించినవి ఎక్కడికీ పోవు. ఒకవేళ పోయినా మరో రూపంలో మనకు వస్తాయి'' అన్నాడు గోవర్ధన్.

తర్వాత వినయ్ కాలేజీకి బయలుదేరుతూ- ''ఈరోజు మీరు కాలేజీకి వచ్చి ఫీజు కడుతున్నారు కదా నాన్నా'' అన్నాడు తండ్రితో.

''ఆ ముందు ఆఫీసుకెళ్లి ముఖ్యమైన పనులు చూసుకుని పన్నెండు గంటలకు మీ కాలేజీకి వస్తాను''

''పదివేలూ కట్టేయకండి. మా ఫ్రెండ్స్ పేరెంట్స్ కొంతమంది బేరమాడితే వెయ్యి రూపాయలు తగ్గించారట''

''అలాగే, ప్రయత్నిస్తాను''

వినయ్‌కు తెలుసు, అది తన తండ్రి వల్ల అయ్యే పని కాదని. 'ఆయనకు మొహమాటం ఎక్కువ. ఏదీ గట్టిగా అడగలేడు. పైగా సున్నితమైన మనసు గలవాడు. ఎవరైనా ఒక మాట అంటే బాధపడిపోతాడు. తను మాత్రం ఎవర్నీ నొప్పించడు. ఈయన ఈ కాలానికి తగ్గ మనిషి కాదు' అనుకున్నాడు.

లలిత ఆఫీసుకు బయలుదేరుతూ ''డబ్బులు జాగ్రత్త. వీలైనంత తొందరగా వెళ్లి కట్టేయండి'' అంది భర్తతో.

''అలాగే''

గోవర్ధన్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. వచ్చే జీతం తప్ప మరో ఆదాయం కోసం ఆశపడనివాడు. నిజాయితీగా బ్రతుకుతున్నవాడు.

స్కూటర్‌పై ఆఫీసుకు వెళుతుండగా అతని ఆఫీసు ఉన్న వీధి మలుపు వద్ద ఓ వ్యక్తి మోటర్ సైకిల్‌పై వచ్చి గోవర్ధన్ స్కూటర్ని ఢీ కొన్నాడు. ఇద్దరూ కిందపడ్డారు. గోవర్ధన్ పైకి లేచి స్కూటర్ని నిలబెట్టి అతని వైపు చూశాడు. నలభై ఏళ్లుంటాయి అతనికి. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. ముక్కు పొడుగ్గా ఉండి ముందర కాస్త వంగినట్టు ఉంది. అతనూ లేచి మోటర్ సైకిల్ నిలబెట్టాడు. ఇంతలో అతని దృష్టి అతనికి దగ్గరలో పడి వున్న పర్సుపై పడింది. దాన్ని చేతిలోకి తీసుకుని తెరచి చూశాడు. అయిదు వందల నోట్లు నిండుగా ఉన్నాయి.

అతని చేతిలోని పర్సు చూసి గోవర్ధన్ కంగారుగా తన జేబు చూసుకున్నాడు. పర్సు కనబడలేదు.

''ఆ పర్సు నాది'' అంటూ అతని చేతిలో నుంచి తీసుకోబోయాడు.

అతను ఆ పర్సును మరో చేతిలోకి మార్చుకుంటూ- ''ఈ పర్సు నీదే అనడానికి సాక్ష్యమేమిటి?'' అని అడిగాడు.

''అందులో నా ఐడెంటిటీ కార్డు ఉంటుంది'' అన్నాడు. అప్పటికే వాళ్ల చుట్టూ జనం మూగారు. అతను ఐడెంటిటీ కార్డు చూసి చుట్టూ చూశాడు. జనం అతన్నే చూస్తున్నారు.

''పర్సు ఆయనదే'' అంటూ వారితో చెప్పి పర్సు గోవర్ధన్‌కు ఇచ్చేశాడు.

అతను బైక్ స్టార్ట్ చేసి ''ఎక్కడ పనిచేస్తున్నావు నువ్వు?'' అని అడిగాడు. అతను అలా ఏకవచనంతో తనని సంభోదించటం గోవర్ధన్‌కు కోపం తెప్పించింది. కోపం దిగమింగుకుని జవాబిచ్చాడు. అతను వెళ్లిపోయాడు.

''మీ అదృష్టం బాగుంది. మీరు వెళ్లిపోయాక అతను పర్సు చూసి ఉంటే మీకు తిరిగి ఇచ్చేవాడు కాదు. మేమెవరూ లేకపోయినా మీ డబ్బు మీకు తిరిగి వచ్చేది కాదు'' అన్నారు అక్కడున్నవారు గోవర్ధన్‌తో.

'అవును. తన అదృష్టం బాగుంది ఈరోజు' అనుకుంటూ ఆఫీసు చేరాడు గోవర్ధన్.

★ ★ ★

పన్నెండు గంటలకు కాలేజీకి బయలుదేరబోతుంటే ఎదురుగా ఓ కానిస్టేబుల్, అతని పక్కనే ఉదయం తన స్కూటర్‌ను మోటర్ బైక్‌తో ఢీకొన్న వ్యక్తి కనిపించారు గోవర్ధన్‌కు. ఆ వ్యక్తి గోవర్ధన్ వైపు చేయి చూపిస్తూ కానిస్టేబుల్‌కు ఏదో చెబుతున్నాడు.

కానిస్టేబుల్ గోవర్ధన్‌ను సమీపించి- ''సార్! నాతో వచ్చిన వ్యక్తి మీకు తెలుసా?'' అని అడిగాడు.

''అతనెవరో నాకు తెలియదు. కానీ ఉదయం నా స్కూటర్‌కు డాష్ కొట్టాడు అతను''

''మీరే అతని బైక్‌కు డాష్ కొట్టారని అతను చెబుతున్నాడు''

''అతనే రాంగ్ సైడ్ వచ్చాడు. పైగా టర్నింగ్ అని తెలిసినా వేగంగా వచ్చి తిరిగాడు''

''అతని కాలికి బలంగా దెబ్బ తగిలింది. ఫ్రాక్చర్ కూడా అయినట్టుంది. అతను మీమీద కంప్లయింటు ఇవ్వడానికి వచ్చాడు''

''దెబ్బ తగిలిందా?'' ఆశ్చర్యంగా చూశాడు గోవర్ధన్. ''కింద పడ్డాక లేచి ఎంచక్కా బైక్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్లడం నేనే కాదు, చాలామంది చూశారు''

''అప్పుడు నొప్పి తెలియలేదు. ఇంటికెళ్లాక చూసుకుంటే కాలు వాచి నొప్పి ఎక్కువైందట. మీరు పదివేలిస్తే కంప్లయింటు ఇవ్వకుండా మంచి హాస్పిటల్‌కెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకుంటాడట''

''పది వేలా?'' ఆశ్చర్యంగా నోరు తెరిచాడు గోవర్ధన్.


''నయాపైసా కూడా ఇవ్వను. నిజానికి అజాగ్రత్తగా బండి నడిపింది అతను. అదృష్టవశాత్తూ ఇద్దరికీ దెబ్బలు తగల్లేదు. మా అబ్బాయి కాలేజీ ఫీజు కని నేను పర్సులో ఉంచుకున్న డబ్బు అతని కంట

పడింది. అది కొట్టేయాలని అతని ప్లాను''

ఆ వ్యక్తి కుంటుకుంటూ ముందుకు వచ్చి- ''రండి కానిస్టేబుల్‌గారూ! అతను మంచిగా చెబితే వినేట్టు లేడు. కంప్లయింటు రాసుకుని జైల్లో వేయండి. ఉద్యోగం పోయి వీధిన పడితే అప్పుడు తెలుస్తుంది'' అన్నాడు కోపంగా.

గోవర్ధన్‌కు భయమేసింది. చుట్టూ చూశాడు. ఎలక్షన్ క్లాసులు జరుగుతున్నందు వల్ల ఆఫీసులో ఇతర ఉద్యోగులు లేరు. ఉన్న ఒక అటెండరు కూడా బయటకెళ్లాడు. సలహా ఇచ్చేవారుగానీ సహాయం చేసే వారు కానీ కనబడలేదు అతనికి.

''మీరు కాలికి శ్రమ ఇవ్వకండి. బయట కూర్చోండి'' అంటూ కానిస్టేబుల్ ఆ వ్యక్తిని బయటకు పంపి ''చూడండి సార్. మనం ఉద్యోగులం. ఆ రౌడీ వెధవలతో మనకు ఎందుకు చెప్పండి? వాడు కంప్లయింటు చేస్తే మిమ్మల్ని స్టేషనుకి పిలుస్తారు. కేసు బుక్ చేస్తారు. అతనికి దెబ్బలు తగిలాయని రుజువైతే హాస్పిటల్ ఖర్చులతో పాటు అతను పడిన బాధలకు నష్టపరిహారం కూడా విధిస్తుంది కోర్టు. మీరే రాంగ్ రూట్‌లో వచ్చి తనను కొట్టారని అతను పదిమందితో సాక్ష్యం కూడా ఇప్పించగలడు. పైగా అతను మీ ఇంటికి వచ్చి గొడవలు చేసే రకం కూడా. మీకు మనశ్శాంతి ఉండదు. పోలీసు స్టేషన్‌లో కేసు రిజిస్టర్ అయిందంటే మీకు అవమానం. ఏ అనారోగ్యమో వచ్చి ఖర్చయిందనుకుని ఆ పదివేలూ అతని ముఖాన పారేయండి. ఇంతటితో అతని పీడ వదిలిపోతుంది మీకు''



గోవర్ధన్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. ఒళ్లంతా చెమటలు పట్టింది. ''అయిదు నిమిషాలు బయట కూర్చోండి. నేను ఆలోచించుకోవాలి'' అన్నాడు కానిస్టేబుల్‌తో.

పది నిమిషాల తర్వాత వాళ్లిద్దర్నీ లోపలికి పిలిచి ఓ కాగితం వారి ముందు పెట్టాడు. తనకు తగిలిన గాయాల చికిత్స నిమిత్తం గోవర్ధన్ నుంచి పదివేలు తనకు అందాయనీ, ఇకపై తనకేదైనా అయితే గోవర్ధన్ బాధ్యత లేదని ఆ కాగితంలో టైపు చేసి ఉంది.

ఆ వ్యక్తి చేత సంతకం పెట్టించుకుని పదివేలు అతనికిచ్చాడు గోవర్ధన్. తర్వాత కానిస్టేబుల్ చేత సాక్షి సంతకం చేయించాడు. ఇద్దరూ వెళ్తొంటే కళ్లనీళ్లతో చూస్తూ కూర్చుండిపోయాడు గోవర్ధన్. 'పదివేలు, అంటే తన నెల జీతం ఘరానాగా దోచుకుని పోతున్నారు. సమాజంలో న్యాయం, ధర్మం ఎక్కడుంది? సామాన్యుడికి ఈ దోపిడి నుంచి రక్షణ ఎక్కడ ఉంది. అతన్ని వారించి, బుద్ధి చెప్పవలసిన కానిస్టేబుల్ తనకు అధైర్యం నూరిపోశాడు. అన్యాయానికి చేయూతనిచ్చాడు' అనుకుని బాధపడ్డాడు. ఈరోజే ఫీజు కట్టేందుకు ఆఖరి రోజని,

**సి. ఎన్. చంద్రశేఖర్**

సటి రోజు నుంచి తనను క్లాసులోకి అనుమతించరని కొడుకు చెప్పడం గుర్తొచ్చింది అతనికి. 'వినయ్, నీ తండ్రి అసమర్థుడురా. ఇటువంటి తండ్రిని పొందిన నువ్వు దురదృష్టవంతుడివి' అంటూ వెక్కి వెక్కి ఏడవసాగాడు. ఆఫీసులో ఎవరూ లేకపోవటం అతనికి లాభించింది ఈసారి.

★ ★ ★

ఆనందంగా స్టేషనులోకి అడుగుపెట్టాడు కానిస్టేబుల్ దామోదరం. అతని ఆనందానికి కారణం అరగంట క్రితం అతని జేబులోకి అయిదు వేల రూపాయలు చేరడమే.

''దామూ.. మీ ఆవిడ ఇందాక ఫోన్ చేశారు. నిన్ను అర్జెంటుగా ఇంటికి రమ్మని చెప్పారు'' మరో కానిస్టేబుల్ చెప్పాడు అతనితో.

''ఎందుకో చెప్పలేదా?''

''చెప్పారుగానీ స్టేషన్ బయట జీపు స్టార్ట్ చేస్తుంటే ఆ శబ్దంలో ఆవిడ ఏం చెప్పారో వినబడలేదు''

''ఇంటికి రమ్మందో, ఆఫీసుకు రమ్మందో సరిగా విన్నావా?''

''ఇంటికే రమ్మన్నారు''

ఇల్లు చేరగానే భార్య ఎదురొచ్చింది వాకిట్లోనే.

''మన బాబు స్కూలు నుంచి సైకిలు మీద వస్తుంటే ఎవరో స్కూటర్‌తో కొట్టేసి వెళ్లిపోయారండి. వాడి కాలు విరిగింది. అర్జెంటుగా డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాలి'' అంది కంగారుగా.

ఆత్రంగా లోపలికి వెళ్లి చూశాడు. పదేళ్ల వయసున్న అతని కొడుకు బాధతో విలవిలలాడుతున్నాడు. ఇరుగుపొరుగు వాళ్లు తలా ఓ డాక్టరు పేరు చెప్పారు. అందరితో చర్చించి, ఎక్కడికి తీసుకె

ళ్లలో నిర్ణయించుకుని, భార్యా కొడుకులతో హాస్పిటల్ చేరాడు దామోదరం. ''డబ్బుందా'' అని భార్య అడిగితే జేబులోని అయిదువేలు గుర్తొచ్చింది. గోవర్థన్ తన వైపు దీనంగా చూడడం కూడా గుర్తొచ్చింది అతనికి.

★ ★ ★

''ఎక్కడైనా కింద పడ్డారా?'' సుందర్‌ను పరీక్షించిన డాక్టరు అడిగాడు.

''అవును. మోటర్ బైక్ స్కిడ్ అయి కింద పడ్డాను''

''ఎన్ని రోజులైంది పడి?''

''నాలుగు రోజులైంది''

''ఇన్నాళ్లూ ఏం చేశారు?''

సుందర్ సమాధానం చెప్పలేదు. అతను గోవర్థన్ నుంచి తీసుకున్న డబ్బులో సగం దామోదరానికి ఇచ్చి మిగతా సగంతో ఈ నాలుగు రోజులూ రేయీ పగలూ తాగాడు. ఆ మత్తులో కాలి బాధ తెలియలేదు. డబ్బు పూర్తిగా అయిపోయాక మత్తు తగ్గి నొప్పి తెలిసింది. చూస్తే కాలు వాచిపోయి ఉంది. వెంటనే డాక్టరు దగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు.

''మీకు షుగరుందా?''

''తెలీదు''

''మీ పెద్దవాళ్లకుందా?''

''మా నాన్నకు ఉంది''

బ్లడ్ సాంపుల్ తీసుకుని పరీక్షించాడు.

''యు ఆర్ అన్‌లక్కీ.. మీకు షుగరుంది. మీకు బాగా తుప్పు పట్టిన ఇనుము గుచ్చుకున్నట్టుంది. అందుకే త్వరగా సెప్టిక్ అయింది. దానికి తోడు మీరు ఆలస్యం కూడా చేశారు కాబట్టి కాలు బాగా ఇన్‌ఫెక్ట్ అయింది. ఇంకో రెండు రోజులు ఆలస్యం చేసి ఉంటే కాలు తీసేయవలసిన పరిస్థితి వచ్చేది. మీరు నేను రాసిచ్చే మందులు క్రమం తప్పకుండా వేసుకుంటానంటే నేను ట్రీట్‌మెంట్ ప్రారంభిస్తాను. ఇలాగే మీరు నిర్లక్ష్యం చేసే పక్షంలో ఏదైనా హాస్పిటల్‌లో అడ్మిట్ అవడం మంచిది''

## ఆదర్శం

ప్రతి వ్యక్తికీ కొన్ని ఆదర్శాలుంటాయి. డ్రీంగర్ల్ హేమమాలినీ కమలదళాలకి తన వంతు మద్దతునిస్తోంది. 'నా ఆలోచనలకి దగ్గరగా ఉన్న పార్టీ బీజెపి. ఆ పార్టీ విజయానికి నా వంతు కృషిచేస్తాను. నాకు ఎలాగూ రాజ్యసభ టికెట్ ఉంది. మళ్లీ పోటీ చేసే విషయం పార్టీ నిర్ణయిస్తుంది. తారల ఇమేజ్ పార్టీలకి బాగా ఉపయోగపడుతుంది' అంటోంది హేమ. ఆమె ఇప్పటికీ అందంతో మెరిసిపోతూ అందర్నీ ఆకట్టుకుంటోంది.



''మందులు వేసుకుంటాను'' భయంగా చూస్తూ అన్నాడు సుందర్. డాక్టర్ చెప్పింది వినగానే అతనికి ఒళ్లంతా చెమటలు పట్టింది.

''రోజూ వచ్చి కట్టు కట్టుకోవాలి. చీము బయటకు తీసి కట్టు కట్టాలి. చాలా బాధ ఉంటుంది. ఓర్చుకోవాలి. ఖరీదైన యాంటీ బయాటిక్స్ వాడాలి. ఓ పదిరోజులు కష్టపడ్డారంటే మీ పుండు మానుతుంది''

అలాగే నన్నట్టు నీరసంగా తలూపాడు సుందర్.

★ ★ ★

డాక్టరు ఇచ్చిన బిల్లు చూసి ఉలిక్కిపడ్డాడు దామోదరం. సరిగ్గా అయిదువేలు అయింది బిల్లు. అడ్వాన్స్ పోను మిగిలిన మొత్తం చెల్లించి ఆటోలో ఇల్లు చేరాడు, కొడుకును డిస్చార్జ్ చేయించుకుని.

''ఎక్కడ్నుంచి వచ్చిందండీ అంత డబ్బు మీకు'' బిల్లు చూసి అడిగింది పద్మజ.

''అరియర్స్ వచ్చాయి''

''నేను నమ్మను. మన క్వార్టర్స్‌లో ఎవరూ మాట్లాడుకోలేదు అరియర్స్ గురించి. ఏ పాడు పనో చేసి వుంటారు. ఎవరి నోరో కొట్టకండి. అది మనకు మంచి చేయదు అని ఎన్ని సార్లు చెప్పినా వినరు మీరు. మీరు చేసిన పాపానికి మన బిడ్డ ఎంత బాధ అనుభవించాడో చూశారుగా. వెళ్లి ఆ డబ్బు ఎవరి నుంచి తీసుకున్నారో వారికే ఇచ్చేయండి''

''ఉన్నపళాన అయిదు వేలు ఎక్కడి నుంచి తేను? మెల్లగా ఇద్దాంలే'' అంటూ బయటకు నడిచాడు దామోదరం.

★ ★ ★

''హలో.. హేమా! ఎలా వున్నారు మీ ఆయన'' పద్మజ స్నేహితురాలిని అడిగింది.

''పర్వాలేదు! ఇన్‌ఫెక్షన్ తగ్గింది. నొప్పి కూడా తగ్గింది. మీ అబ్బాయికెలా వుంది?''

''వాడికీ నొప్పి తగ్గింది. ఇంకో పది రోజులు నడవకూడదన్నారు డాక్టరు. ఏమిటో మనిద్దరి టైమూ బాగాలేనట్టుంది'' అని అప్పుడే అక్కడికి వచ్చిన లలితను చూసి ''హలో లలితా మేడమ్! ఎలా వున్నారు మీరు? పదిహేను రోజులుగా మేమిద్దరం లీవులో ఉన్నాం కదా! ఆఫీసు విశేషాలేమిటి? మీ ఇంట్లో అందరూ క్షేమమే కదా!'' అని ఆప్యాయంగా లలితను పలకరించింది పద్మజ.

''శారీరకంగా అందరం బాగానే ఉన్నాం. మానసికంగానే బాగా లేదు'' అంటూ తన భర్త పది వేలు పోగొట్టుకున్న విషయం చెప్పింది లలిత.

''మీవారు మరీ అంత మెతకైతే ఎలా మేడమ్? కనీసం ఆ వ్యక్తి పేరూ, అడ్రసు తెలుసుకున్నారా? మన పద్మజ భర్త పోలీసు డిపార్టుమెంటే కదా. ఆయన మనకు సహాయం చేస్తారు'' అంది హేమలత.

''ఆయన చెప్పారు గానీ నాకు గుర్తు లేదు. ఆ

వ్యక్తితో పాటు వచ్చిన కానిస్టేబుల్ పేరు మాత్రం దామోదరం అని తెలుసు.

ఆ మోటర్ సైకిల్ అతని ముక్కు పొడుగ్గా, కాస్త కిందకి వంగి గ్రద్ద ముక్కులా వుండటం. గ్రద్దలా వచ్చి పదివేలూ తన్నుకుపోయాడని మావారు వాపోయారు''

ఆ మాట వినగానే పద్మజ, హేమలత ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. లలితకు ధైర్యం చెప్పి, లలిత వెళ్లిపోయాక పద్మజ ''ఇది మనవాళ్ల నిర్వాకమే. మా ఆయనా, మీ ఆయనా కలిసి చేసిన పాపపు పని ఇది. దాని ఫలితం మీ ఇంట్లో మీ ఆయన అనుభవిస్తే మా ఇంట్లో ఏ పాపం ఎరగని నా బిడ్డ అనుభవించాడు'' అంది హేమలతతో. ఆ మాట అంటున్నప్పుడు ఆమె కంట్లో నీరు తిరిగింది.

''పాపం లలిత ఎంతో డల్ అయిపోయింది. పది వేలంటే మాటలా?

ఎంత కష్టపడితే అంత డబ్బు సంపాదించగలడు? పైగా వాళ్లాయన నిజాయితీకి మారుపేరు'' అంది హేమలత.

పద్మజ, హేమలత ఆ ఆఫీసులో అయిదేళ్లుగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితమే ఉద్యోగంలో చేరిన లలిత అంటే వాళ్లకు ప్రత్యేకమైన అభిమానం. అందుకు కారణం లలిత అందంగా, అమాయకంగా ఉంటుంది. అందరితో స్నేహంగా ఉంటుంది. ఎవర్నీ హర్ట్ చేయదు. మంచి సలహాలిస్తూ సహాయం చేస్తూ అందరికీ ఆప్తురాలైంది. ''మిమ్మల్ని చూస్తుంటే అలాగే చూస్తుండిపోవాలనిపిస్తుంది. మిమ్మల్ని, మీ నవ్వును చూస్తే మాకు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది'' అంటుంటుంది పద్మజ లలితతో.

''మనం ఏదో ఒక లోను తీసుకుని ఆ పదివేలూ లలిత భర్తకు ఇచ్చేయమని మనవాళ్లకు చెబుదాం. నువ్వేమంటావు?'' అంది పద్మజ.

''అలాగే! మన బాధలు మనకు ఎటూ తప్పవు. పాపం లలితగారిని అలా చూడలేకపోతున్నాను. కనీసం వాళ్లనైనా హాయిగా ఉంచుదాం.

కానీ నా అయిదు వేలు కూడా నీకే ఇస్తాను. మీ ఆయన ద్వారా పంపించు. ఈయనకిస్తే ఆ అయిదు వేలు కూడా తాగడానికి వాడేస్తారు'' అంది హేమలత.

''అలాగే''

ఓ మంచి పని చేయబోతున్నామన్న తృప్తి వారికెంతో ఆనందాన్నిచ్చింది.

★ ★ ★

భార్య బలవంతం మీద జరిగిన విషయం చెప్పాడు దామోదరం.

''ఛీ.. ఏం మనుషులండీ మీరు? డబ్బు కోసం ఇంత నీచానికి దిగజారతారా? ఆ అమాయకుడిని చూసినా మీకు జాలి కలగలేదా? ఇంతకూ అతనెవరో తెలుసా? నాకూ హేమకూ ప్రాణస్నేహితురాలి భర్త'' అంటూ అతని చేతిలో పదివేలు పెట్టి, ''ఇది హేమ తన భర్తకు తెలియకుండా ఇచ్చింది. మీరిద్దరూ వెళ్లి ఆయనకు ఇచ్చేసి రండి. మీరు డబ్బు ఇచ్చారో లేదో మధ్యాహ్నం ఆయన భార్య వల్ల నాకు తెలుస్తుంది. కాబట్టి ఎలాంటి వేషాలూ వేయకుండా ఇచ్చేసి రండి'' అంది పద్మజ.

ఆ డబ్బు హేమలత ఇచ్చిందని చెప్పడం వల్ల, అతని మనసులోనూ గిల్టీ ఫీలింగ్ ఉన్నందువల్ల వెంటనే అంగీకరించాడు దామోదరం. ఇంటి నుంచి బయలుదేరి కిషోర్ ఇంటి వైపు నడవసాగాడు.

★ ★ ★

''మీ పది వేలు ఇదిగో. జరిగిన దానికి మేమెంతో బాధపడుతున్నాము. మమ్మల్ని క్షమించండి''

దామోదరం మాటలు విని ఆశ్చర్యపోయాడు గోవర్ధన్. చేతిలో పదివేల రూపాయలు కనబడుతున్నా నమ్మలేకపోతున్నాడు. ఏం మాట్లాడాలో తోచక, వారివైపే చూస్తుండిపోయాడు.

''మేము వస్తాము'' అన్నాడు దామోదరం.

వెళ్లిపోతున్న ఇద్దర్నీ పిలిచి కిషోర్ చేతిలో ఓ కాగితం పెట్టాడు గోవర్ధన్. పదివేలు తనకు అందినట్టుగా కిషోర్ సంతకం చేసిన కాగితం అది. గోవర్ధన్ వైపు కృతజ్ఞతగా చూసి ఆ కాగితాన్ని చించేశాడు కిషోర్.

''కష్టార్జితం ఎక్కడికీ పోదని, ఏదో ఒక రూపంలో మళ్లీ తిరిగి వస్తుందని నా భార్యాపిల్లలకు చెబుతూ ఉండేవాణ్ణి. అది నిజమైంది ఈరోజు'' అన్నాడు గోవర్ధన్.

''అంతే కాదు, అన్యాయంగా సంపాదించిన డబ్బు నిలవదని, ఒక మంచి వ్యక్తిని పీడించి లాక్కొన్న డబ్బు మనకు మంచి చేయదు సరికదా మానసికంగా శారీరకంగా హింసిస్తుందని మాకూ తెలిసింది'' అన్నాడు కిషోర్, తాను అనుభవించిన నరకాన్ని తలచుకుంటూ.

''మీకు చెడు జరగాలని మాత్రం నేను కోరుకోలేదు'' అన్నాడు గోవర్ధన్ బాధ పడుతూ.

''మాకు తెలుసు. అందుకే మేము కష్టాల నుంచి బయటపడ్డాము. ఒక మంచి వ్యక్తి నోటి శాపం, న్యూక్లియర్ బాంబ్ కంటే ఎక్కువ అనర్థాలను తెచ్చిపెడుతుంది. వస్తాను'' అన్నాడు దామోదరం.

డబ్బు తిరిగి వచ్చిన విషయం భార్యాపిల్లలకు చెబితే వాళ్ల మొహాల్లో కనిపించే ఆనందాన్ని అక్కడే నిలబడి ఊహించుకోసాగాడు గోవర్ధన్.

## పరమావధి

**ఎప్పుడూ ఒకేరకం పాత్రలు బోర్ అనిపిస్తాయి. అయితే షారూక్‌ఖాన్ మాత్రం ఎప్పుడూ చేసే పాత్రల పేర్లు మారతాయి గానీ వాటి స్వభావం మాత్రం ఒకేలా ఉంటుందన్న విమర్శలొస్తున్నాయి. ఈ సంగతే అడిగితే 'ఒకోసారి ఇలాంటి పాత్రలు చేయడం తప్పదు. అయితే ఇలాంటి పాత్రలంటే నాకెంతో ఇష్టం. మనచుట్టూ కన్పించేలాంటి పాత్రలే సినిమాలో ఉంటే సహజంగా ఉంటాయి. అయినా నేనిప్పుడు చాలా హేపీగా ఉన్నాను' అంటున్నాడు ఎస్సార్కె. ఏ పాత్రలు చేసినా అందర్నీ ఆకట్టుకోవడమే కదా పరమావధి అని కూడా స్టేట్‌మెంట్ ఇస్తున్నాడు.**

